## సిద్ధమవుతున్న బీఆర్ఎస్ గద్దెలు

గ్రామాల్లో బీఆర్ఎస్ గద్దెలకు రంగులు వేసిన దృశ్యం

గజ్వేల్, ఏప్రిల్ 24: వరంగల్ జిల్లాలో ఈనెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు ముందు గ్రామాల్లో జెండాలు ఎగురవేసేందుకు గద్దెలు సిద్ధమవుతున్నాయి. గజ్వేల్ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ శ్రేణులు గ్రామాల్లోని గద్దెలకు రంగులు వేయిస్తున్నారు. గ్రామాల్లో పార్టీ గోడపత్రికలను అతికిస్తున్నారు. పార్టీ బహిరంగ సభకు తరలివెళ్లేందుకు పార్టీ శ్రేణులు ముందుగానే తమతమ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. నియోజకవర్గంలో 250కి పైగా ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు ఏర్పాటు చేయగా ప్రతి గ్రామం నుంచి 60నుంచి 70 మందిని ఆర్టీసీ బస్సుల్లో తరలించేందుకు కార్యాచరణ రూపొందించారు.

**పూర్తయిన కార్యకర్తల సమావేశాలు**

గజ్వేల్ నియోజకవర్గంలోని తొమ్మిది మండలాలు, రెండు మున్సిపాలిటీల్లో ఇప్పటికే ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశాలు పూర్తి చేసి దిశానిర్దేశం చేశారు. బహిరంగ సభకు కార్యకర్తలను తరలించే విధంగా గ్రామాల్లో అందరినీ కలిసి ఆహ్వానించాలని కోరారు. నియోజకవర్గంలోని గజ్వేల్, జగదేవ్‌పూర్, వర్గల్, ములుగు, మర్కూక్, కొండపాక, కుకునూర్‌పల్లి, తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లోని గ్రామాలు, గజ్వేల్, తూప్రాన్ మున్సిపాలిటీల్లోని వార్డుల వారీగా ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులను సమకూర్చారు.

## కాంగ్రెస్ పాలన తెలంగాణకు శాపం

మాట్లాడుతున్న కుంభాల చంద్రశేఖర్, నాయకులు

చిన్నకోడూరు, ఏప్రిల్ 24: 15 నెలల కాంగ్రెస్ పాలన తెలంగాణ రాష్ట్రానికి శాపంగా మారిందని బీఆర్ఎస్ అల్లిపూర్ గ్రామ అధ్యక్షుడు కుంభాల చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని అల్లిపూర్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచన మేరకు వరంగల్ జిల్లాలోని ఎల్కతుర్తి సభకు విద్యార్థి, యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. యావత్ తెలంగాణ ప్రజలు కేసీఆర్ గురించి మాట్లాడుకుంటున్నారని గుర్తుచేశారు. కేసీఆర్ సందేశం కోసం రాష్ట్ర ప్రజలంతా ఎదురు చూస్తున్నారన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ గడ్డం రాజేశంగౌడ్, గీకురు బాలయ్య, బీఆర్ఎస్వీ మండల ఉపాధ్యక్షుడు కుంభాల మహేశ్, బీఆర్ఎస్వీ గ్రామ అధ్యక్షులు రుచిత్‌రెడ్డి, పిల్లి నరసింహులు, తిరుపతి, నాగరాజు, అజయ్, భరత్, పరశురాములు, బోయ తిరుపతి పాల్గొన్నారు.

## హుస్నాబాద్‌లో వరుస దొంగతనాలు

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 24: కొన్నాళ్లు ప్రశాంతంగా ఉన్న హుస్నాబాద్‌లో మళ్లీదొంగతనాలు జరగడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పట్టణంలోని మూడు చోట్ల తాళాలు వేసిన ఇండ్లల్లో దొంగలుపడి విలువైన వస్తువులను ఎత్తుకెళ్లారు. ఎల్ఐసీ కాలనీలో వెంకటస్వామి ఇంటికి తాళం వేసి స్వగ్రామానికి వెళ్లగా దొంగలు బుధవారం అర్ధరాత్రి తాళాలు పగులగొట్టి 13గ్రాముల బంగారం, 20వేల నగదు, వెండి వస్తువులను దోచుకెళ్లారు. అక్కన్నపేట రోడ్డులోని ఒక ప్రైవేట్ కార్యాలయం గదితాళం పగులగొట్టి వస్తువులను చిందర వందరచేయగా, ఈ ఇంటికి దగ్గరలోని ఓ ఇంటిలో సైతం దొంగతనానికి పాల్పడినట్లు తెలిసింది. వెంకటస్వామి ఇంట్లో పోలీసు క్లూస్‌టీం వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

## సమ్మర్ క్యాంపుతో సృజనాత్మకత

మిరుదొడ్డి: అందె ప్రాథమిక పాఠశాలలో మాట్లాడుతున్న ఎంఈవో ప్రవీణ్‌బాబు

మిరుదొడ్డి, ఏప్రిల్ 24: సమ్మర్ క్యాంపుతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని మండల ఎంఈవో ప్రవీణ్‌బాబు అన్నారు. గురువారం మండలంలోని అందె, కాసులాబాద్ ప్రాథమిక పాఠశాలల్లో సమ్మర్ క్యాంపును ఆయన ప్రాంభించారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, కృష్ణ, రాజేశ్వర్, నర్సింహులు పాల్గొన్నారు.

**రేబర్తి, గాగిళ్లాపూర్‌లో..**

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 24: సమ్మర్ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో వరదరాజు కోరారు. మద్దూ రు మండలం రేబర్తి ఉన్నత పాఠశాల, గాగిళ్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో సమ్మర్ క్యాంపులను ప్రారంభించారు. హెచ్ఎంలు హరిప్రసాద్, రాజిరెడ్డి, టీచర్లు మల్లేశం, నర్సింహులు, శ్రీనివాస్‌రెడ్డి, కనకయ్య,పాల్గొన్నారు.

**బెజ్జంకిలో..**

బెజ్జంకి, ఏప్రిల్ 24: మండల కేంద్రంతోపాటు, చీలాపూర్ ప్రభుత్వ పాఠశాలల్లో సమ్మర్‌క్యాంపులను ఎంఈవో మహతిలక్ష్మి ప్రారంభించారు. టీచర్లు శ్రీనివాస్, రజనీష్, ప్రభాకర్, రవీందర్, నజీర్, శంకరాచారి, రవీందర్‌రెడ్డి, బాలయ్య, సంపత్, రమేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేదల కోసమే సత్యసాయి సేవలు

భజనలు చేస్తున్న రజితావెంకన్న తదితరులు

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 24: పేదల కోసం సత్యసాయిబాబా సేవలందించారని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న కొనియాడారు. హుస్నాబాద్ సత్యసాయి బాబా సేవాసమితి ఆధ్వర్యంలో సత్యసాయి బాబా 14వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీచౌరస్తాలో సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాల వేసి, ప్రత్యేక భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పలువురికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు తనుకు ఆంజనేయులు, సత్యసాయిబాబా సేవాసమితి కన్వీనర్ రవీందర్, మాజీకౌన్సిలర్ శ్రీనివాస్, వైకుంఠం, యాదగిరిరెడ్డి, సంధ్యావళి, లక్ష్మి, స్వరాజ్యం, హేమలత, ఉమారాణి పాల్గొన్నారు.

### చుంచనకోటలో బడిబాట

చుంచనకోటలో బడిబాట నిర్వహిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

చేర్యాల, ఏప్రిల్ 24: మండలంలోని చుంచనకోటలో గురువారం ఎంఈవో కిష్టయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ముందస్తు బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ తల్లిదండ్రులు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, సర్కారు బడులను బలోపేతం చేయాలని కోరారు. ఉన్నత, ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు మురళీకృష్ణ, అంబాల వెంకటేశ్, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్, అనిల్, శ్రీధర్, జ్యోతి, శారద, రజిత, ఉషారాణి, శారద పాల్గొన్నారు.

## మేలిమి రకాలతో అధిక దిగుబడులు

రైతులకు అవగాహన కల్పిస్తున్న కోటిరెడ్డి

కొమురవెల్లి, ఏప్రిల్ 24: మేలిమి రకాలతో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని జీనెక్స్ సీడ్ కంపెనీ రీజినల్ మేనేజర్ కోటిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రాంసాగర్‌లో జీనెక్స్ సీడ్స్ ఇండియా సౌజన్యంతో హైబ్రిడ్ జీపీహెచ్ 699 వరిరకంపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. జీనెక్స్ సీడ్‌తో అధిక దిగుబడులు సాధించిన రైతు సంజీవరెడ్డిని సన్మానించారు. రైతుమిత్ర ఫర్టిలైజర్ యజమాని దొడ్డ రాజు, ఏరియా అధికారి నవీన్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# పహల్గాం అమరులకు ఘన నివాళి

సిద్దిపేట టౌన్: నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

చేర్యాల: కోర్టు ఆవరణలో నివాళులర్పిస్తున్న న్యాయమూర్తి, న్యాయవాదులు

చేర్యాల, ఏప్రిల్ 24: జమ్ముకశ్మీరులోని పహల్గాంలో ఉగ్రవాదుల చేతిలో మృతిచెందిన అమరులకు చేర్యాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం చేర్యాల కోర్టు ఆవరణలో న్యాయమూర్తి కృష్ణతేజ, సిబ్బంది, న్యాయవాదులు నివాళులర్పించారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు విధులను బహిష్కరించి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆరెళ్ల వీరమల్లయ్య, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

**ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి**

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 24: భారతదేశంలో అక్రమంగా చొరబడి పర్యాటకులపై దాడిచేసిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని న్యాయవాదులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జమ్ముకశ్మీరులోని పహల్గాంలో ఉగ్రదాడిని ఖండిస్తూ గురువారం సిద్దిపేట బార్ అసోసియేషన్ న్యాయవాదులు నిరసన ర్యాలీని నిర్వహించారు.

## వాలీబాల్ క్రీడలో నైపుణ్యం సాధించాలి

వాలీబాల్ కిట్ అందజేస్తున్న క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ హైదర్‌పటేల్

గజ్వేల్, ఏప్రిల్ 24:వాలీబాల్ క్రీడలో నైపుణ్యం సాధించాలని క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ హైదర్‌పటేల్ అన్నారు. గురువారం మండలంలోని ప్రజ్ఞాపూర్‌లో నిర్వహించే వేసవి శిక్షణా శిబిరానికి క్రీడా జ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో మెళకువలు నేర్చుకొని రోజూ సాధన చేస్తే ఉత్తమ ఫలితాలు సాధిస్తారన్నారు. కార్యక్రమంలో జడ్పీ పాఠశాల హెచ్ఎం కృష్ణ, టీచర్ ఎల్లయ్య, పీడీలు విజయరేఖ, గోవర్ధన్, నవీన్, నరేశ్, కోచ్ ప్రభు పాల్గొన్నారు.

## నిరుపేద వధువుకు పుస్తెమట్టెలు అందజేత

పుస్తెమట్టెలు అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

సిద్దిపేట టౌన్,24 : నిరుపేద వధువు వివాహానికి సిద్దిపేట వాసవి క్లబ్ చేయూతగా నిలిచింది.క్లబ్ అధ్యక్షుడు మురంశెట్టి కుమార్ మాట్లాడుతూ.. లింగారెడ్డిపల్లికి చెందిన వధువు అక్షిత వివాహానికి శివకుమార్ దంపతుల సహకారంతో గురువారం పుస్తెమట్టెలు,బియ్యం అందజేశామన్నారు.కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట, ఏప్రిల్ 24: జమ్ముకశ్మీరులోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీఆర్ఎస్ సిద్దిపేట నాయకులు జాప శ్రీకాంత్‌రెడ్డి, ఎడ్ల సోమిరెడ్డి, కోలా రమేశ్ గౌడ్, కిషన్‌రెడ్డి, అరవింద్ రెడ్డి, కాముని శ్రీనివాస్ తెలిపారు. గురువారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాయకులు శాతరాజుపల్లి ఆంజనేయులు, ఎల్లయ్య, వేణుచక్రవర్తి, సాయిప్రేమ్, రాముతో కలిసి వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పహల్గాంలోని బైసరన్ లోయలో పర్యాటకులే లక్ష్యంగా పాకిస్థాన్ కేంద్రంగా ఉగ్రకార్యకలాపాలు నిర్వహించే లష్కరేతోయిబా అనుబంధ విభాగం దిరెసిస్టెంట్ ఫ్రంట్ దాడి చేయటాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య అన్నారు. నాయకులు బెల్లంకొండ వెంకట్, నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, సాయి గౌడ్, రాజు, సతీశ్ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు

మాట్లాడుతున్న చుక్క రాములు

సిద్దిపేట ఏప్రిల్ 24: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని, ఇటీవల కురిసిన వర్షాలు, వడగండ్ల వానతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యాలయం కార్మిక కర్షక భవన్‌లో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కాముని గోపాలస్వామి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ఆలస్యం చేయడం వల్ల అకాల వర్షాల వల్ల తడిసి రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శశిధర్, ఎల్లయ్య, సత్తిరెడ్డి, భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు వెంకటమావో, యాదగిరి, రవికుమార్, అరుణ్‌కుమార్, రవీందర్, బాల నరసయ్య, నవీన, శారద, శ్రీనివాస్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారుల ఎంపిక ప్రారంభించాలి

- కలెక్టర్ మను చౌదరి

మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 24: రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభించాలని కలెక్టర్ మనుచౌదరి సంబంధిత అధికారులు, బ్యాంకు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపికపై సంబంధితశాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రాజీవ్ యువ వికాసం పథకం కింద స్వయం ఉపాధి కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖల ద్వారా దాదాపు 60 వేల మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. నేడు మండల స్థాయిలో ఎంపీడీవోలు, బ్యాంకర్లు సమావేశం నిర్వహించి.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖలు, బ్యాంకుల వారీగా దరఖాస్తులను స్క్రుటినీ నిర్వహించాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలన్నారు. సంబంధితశాఖల వారీగా, బ్యాంకర్ల వారీగా సిద్ధం చేసిన లబ్ధిదారుల జాబితాను మే 21వ తేదీలోగా కలెక్టరేట్‌లో సమర్పించాలన్నారు. సమావేశంలో ఎల్‌డీఎం హరిబాబు, డీఆర్డీవో జయదేవ్ ఆర్యా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కేదార్‌నాథ్‌లో అన్నదానం దైవ సంకల్పం

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కేదార్‌నాథ్ సమితి సభ్యులు

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 24: కేదార్‌నాథ్‌లో అన్నదానం దైవసంకల్పమని కేదార్‌నాథ్ అన్నదాన సేవా సమితి అధ్యక్షుడు చీకోటి మధుసూదన్ అన్నారు. మే 2న కేదార్‌నాథ్ యాత్ర ప్రారంభం కానున్న నేపథ్యంలో సిద్దిపేట అన్నదాన సేవా సమితి కేదార్‌నాథ్‌లో ఐదోసారి అన్నదానం చేసేందుకు సిద్ధమైంది. ఈ మేరకు దాసాంజనేయ ఆలయంలో గురువారం సమితి సభ్యులు మీడియా సమావేశం నిర్వహించి అన్నదాన కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం సమితి అధ్యక్షుడు చీకోటి మధుసూదన్ మాట్లాడుతూ.. కేదార్‌నాథ్ సన్నిధిలో అన్నదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. అందులో భాగంగా శుక్రవారం సిద్దిపేట శరభేశ్వరస్వామి దేవాలయం వద్ద కేదార్‌నాథ్‌కు వెళ్లే ఆహార పదార్థాల వాహన పూజ, శివకల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తామన్నారు. పూజలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొంటారన్నారు. కేదార్‌నాథ్ ఆలయం, సోన్‌ప్రయాగ్ వద్ద అన్నదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సేవా సమితి ప్రధాన కార్యదర్శి ఐయిత రత్నాకర్, కోశాధికారి గోపిశెట్టి శరభయ్య, ఉపాధ్యక్షులు కంచం కాశీనాథ్, గంజిరాములు, బుచ్చయ్య, శ్రీనివాస్, పీఆర్‌వో మంకాల నవీన్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మెప్మా ఆర్పీపై చర్యలు తీసుకోవాలి

మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న నెహ్రూ మహిళా సంఘం సభ్యులు

గజ్వేల్, ఏప్రిల్ 24: మున్సిపల్‌లోని మెప్మా ఆర్పీ కృష్ణలీలపై చర్యలు తీసుకోవాలని గురువారం మున్సిపల్ కమిషనర్ నర్సయ్యకు నెహ్రూ మహిళా సంఘం సభ్యులు మమత, స్వప్న, శ్వేత, ఉపేంద్ర, ఉమారాణి, రేణుక ఫిర్యాదు చేశారు. తమ మహిళా సంఘం పేరుతో ఎస్‌బీఐలో రూ.20లక్షల రుణం మంజూరు అయిందన్నారు. దయ్యాల మమతకు రూ.4లక్షలు మంజూరు కాగా ఆ డబ్బులను ఆర్పీ కృష్ణలీల, మహిళా సంఘం అధ్యక్షురాలు మంజుల కలిసి వారి ఖాతాలోకి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారని, గ్రూపు సభ్యులు మల్లికాంబకు రూ.2లక్షలు రాగా అందులో లక్ష, రేణుకకు రూ.2లక్షలు, ఉమారాణి రూ.2లక్షలు, దివ్యభారతికి చెందిన రూ.2లక్షలను కృష్ణలీల, మంజులు తమ ఖాతాలోకి మొత్తం డబ్బులను బదిలీ చేయించుకున్నారని తెలిపారు. కృష్ణలీల, మంజులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## నేడు వినియోగదారుల సేవామేళా

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 24: సిద్దిపేట బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో శుక్రవారం వినియోగదారుల సేవా మేళా నిర్వహిస్తున్నట్లు ఆశాఖ ఏజీఎం లక్ష్మణ్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు సేవా మేళా కొనసాగుతుందని చెప్పారు. వినియోగదారులు ఎఫ్‌టీటీహెచ్, ఇంటర్నెట్, బిజినెస్, మొబైల్ తదితర సేవలు, సమస్యలను పరిష్కరించుకోవడానికి సంప్రదించాలని ఆయన కోరారు.

## హెల్త్ క్యాంపును వినియోగించుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న సంఘం నేతలు

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 24: సిద్దిపేట నీలకంఠేశ్వరాలయ కమ్యూనిటీ హాల్‌లో మే 1న నిర్వహించే చేనేత హెల్త్ క్యాంపును కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని ఆలిండియా ఫెడరేషన్ అధికార ప్రతినిధి రాపోలు జగన్, కన్వీనర్ శాంతికుమారి కోరారు. సిద్దిపేటలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్, సిద్దిపేట ఐఎంఏ డాక్టర్స్ ఆధ్వర్యంలో క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్మికులకు అన్ని రకాల పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తామన్నారు. సమావేశంలో రాజేశం, జ్ఞానేశ్వర్, పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు సతీశ్, లోక లక్ష్మీరాజ్యం, నర్సింహులు, యేగేశ్వర్, మల్లేశం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రగతిచక్రం అవార్డులు అందజేత

ప్రగతి చక్రం అవార్డులు అందుకున్న ఉద్యోగులు

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 24: ప్రయాణికులకు ఉత్తమ సేవలు అందించి మన్ననలు పొందాలని సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ రఘు సూచించారు. సిద్దిపేట ఆర్టీసీ డిపోలో గురువారం ఉత్తమ ఉద్యోగులకు ప్రగతి చక్రం అవార్డులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సిద్దిపేట, దుబ్బాక డిపోల్లో 92 మంది ఉద్యోగులు మెరుగైన సేవలు అందించారన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రతిఒక్కరూ పనిచేసి సిద్దిపేట, దుబ్బాక డిపోలను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలుపాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దివాస్

కేక్ కట్ చేస్తున్న మాధవ్‌జాదవ్

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 24: మద్దూరు మండల కేంద్రంతో పాటు మండలంలోని రేబర్తి గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద పంచాయతీ కార్యదర్శి మాధవ్‌జాదవ్ ఆధ్వర్యంలో గురువారం 'జాతీయ పంచాయతీ దివాస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. కేక్ కట్ చేసి గ్రామస్తులకు పంచిపెట్టారు. గ్రామ సభల్లో ఎంపీడీవో సోమిశెట్టి రామ్మోహన్ మాట్లాడారు. గ్రామస్తులచే స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీవోలు వీరరాజు, వెంకటేశ్వర్లు అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### యూనిఫామ్స్ తయారీ పరిశీలన

చేర్యాల, ఏప్రిల్ 24: మండలంలోని వీరన్నపేటలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన యూనిఫామ్స్ తయారీని గురువారం ఎంఈవో ఆర్.కిష్టయ్యతో కలిసి డీఈవో శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ జూన్ 1వ తేదీలోగా యూనిఫామ్స్ తయారీ పూర్తి చేయాలని సూచించారు.పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు విద్యార్థులకు దుస్తులు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుడు పి.కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చేర్యాల, ఏప్రిల్ 24: మండలంలోని తాడూరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలించేందుకు యత్నిస్తున్న ఓ ట్రాక్టర్‌ను పలువురు గ్రామస్తులు బుధవారం అర్ధరాత్రి పట్టుకున్నారు. అనంతరం ఇసుక ట్రాక్టర్‌ను గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పార్కు చేసి సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. నిత్యం వాగు నుంచి ఇసుకను పలువురు అక్రమంగా రవాణా చేస్తున్నారని, వెంటనే అరికట్టాలని గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామంలో పలువురు ట్రాక్టర్ యజమానులు ఇసుక డంపులుగా పోశారని, వాటిని స్వాధీనం చేసుకోవాలని కోరారు.

### కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 24: కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యానికి మద్దతు ధర లభిస్తుందని మద్దూరు మండల వ్యవసాయశాఖ అధికారి రామకృష్ణ అన్నారు. గురువారం మద్దూరు మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి కొనుగోళ్లను పరిశీలించారు. ఆయన వెంట ఏఈవో రాజు ఉన్నారు.

### ట్రాన్స్‌ఫార్మర్ కాపర్‌వైరు చోరీ

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్24: గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి కాపర్‌వైరును చోరీచేసిన ఘటన మద్దూరు మండలం సలాఖపూర్‌లో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. విద్యుత్ శాఖ ఏఈ రాజు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కామిడి వెంకటరెడ్డి బావి సమీపంలో 25కేవీఏ సామర్థ్యం గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి అందులోని కాపర్‌వైరు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. దీని విలువ సుమారు రూ. 50వేల వరకు ఉంటుందన్నారు. మద్దూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

### అంగన్‌వాడీలో వార్షికోత్సవం

గజ్వేల్, ఏప్రిల్ 24: మున్సిపల్ పరిధిలోని క్యాసారం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం వార్షికోత్సవం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ సునీత చిన్నారులకు ప్రోగ్రెస్ రిపోర్టులు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నదని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

### చట్టాలపై అవగాహన

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 24: పట్టణంలోని జడ్పీహెచ్ బాలుర పాఠశాలలో గురువారం ఓపెన్ ఇంటర్ ఎగ్జామ్స్ విద్యార్థినీ విద్యార్థులకు మహిళల రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, గంజాయి మత్తు పదార్థాలు, ఈవ్‌టీజింగ్, నూతన చట్టాలపై హుస్నాబాద్ షీటీమ్ బృందం సభ్యులు అవగాహన కల్పించారు. ఎవరైనా దుశ్చర్యలకు పాల్పడినట్లు తెలిస్తే 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై మణెమ్మ, షీటీమ్ సభ్యులు సదయ్య, ప్రశాంతి, కృష్ణ పాల్గొన్నారు


पंजाब नैशनल बैंक ...भरोसे का प्रतीक! | పంజాబ్ నేషనల్ బ్యాంక్ ...the name you can BANK upon!

**సర్కిల్ SASTRA, సర్కిల్ కార్యాలయం–సికింద్రాబాద్**
రెండవ అంతస్తు, మహర్షి హౌస్, రోడ్ నెం. 3, బంజారా హిల్స్, హైదరాబాద్–500 034.
[ఫోన్ నెం. 040-23147032, 23147052] [ఇ–మెయిల్: cs8313@pnb.co.in]

**స్థిరాస్తుల అమ్మకం కోసం అమ్మకం ప్రకటన**

సెక్యూరిటి ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6)కు నిబంధనతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటి ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కోసం ఇ–వేలం అమ్మకం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టిన/చార్జ్ చేసిన, బ్యాంక్ యొక్క అధీకృత అధికారి/సెక్యూర్డ్ క్రెడిటార్‌చే **నిర్మాణాత్మక/భౌతిక/లాంఛనప్రాయ స్వాధీనం** చేసుకున్న దిగువ తెలిపిన స్థిరాస్తి, సంబంధిత రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు) నుండి సెక్యూర్డ్ క్రెడిటార్/ బ్యాంక్‌కు బకాయివున్న మొత్తాలను రాబట్టుకొనుటకు ఇందులో దిగువ వివరించిన పట్టికలో తెలిపిన తేదీన **"ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా మరియు అక్కడ ఏమున్నదో అదే "** పద్ధతిన విక్రయించబడుతుందని ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది. రిజర్వు ధర మరియు బయానా వివరాలు సంబంధిత ఆస్తులకు ఎదురుగా దిగువ పట్టికలో తెలుపబడినవి.

**సెక్యూర్డ్ ఆస్తుల షెడ్యూల్**

| క్ర. సం. | శాఖ పేరు ఖాతా పేరు రుణగ్రహీత/హామీదారుల పేరు & చిరునామా | తనఖా పెట్టిన స్థిరాస్తుల వివరణ/ యజమాని పేరు (ఆస్తి (ఆస్తుల) తనఖాదారులు) | A) SARFESI చట్టం 2002లో సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీస్ తేది. B) బకాయి మొత్తం. C) SARFESI చట్టం 2002లో సెక్షన్ 13(4) క్రింద స్వాధీనత తేది. D) స్వాధీనత స్వభావం లాంఛనప్రాయ/ భౌతిక/నిర్మాణాత్మక | A) రిజర్వు ధర B) బయానా C) బిడ్ పెంపుదల మొత్తం | ఇ–వేలం తేదీ/ సమయం |
|---|---|---|---|---|---|
| 1. | సిద్దిపేట (181410) కోనేటి తిరుపతి | సిద్దిపేట మండలం మరియు జిల్లా శాంతినగర్, కుబేరా అపార్ట్‌మెంట్ దగ్గర గల 904.62 చ.అడుగుల ప్లింత్ ఏరియా మరియు సర్వే నెం. 1903లో విస్తీర్ణ 186.66 చ.గజాల ప్లాట్ నెం. 49లో ఇం.నెం. 18-09-67/5 గ్రౌండ్ ఫ్లోర్‌తో నివాస వ్యక్తిగత భవనం మరియు **సరిహద్దులు: తూర్పు:** హరిదాసు & ఇతరుల ఇల్లు, **పడమర:** సద్ది శ్రీను ఇల్లు, **ఉత్తరం:** 24 అడుగుల రోడ్, **దక్షిణం:** ఇతరుల ఖాళీ స్థలం. శ్రీ కోనేటి తిరుపతి, తండ్రి: శ్రీ కె.మల్లయ్య పేరు మీద ఉన్న ఆస్తి. | A) 30-08-2024 B) రూ. 37,87,805.29 + వర్తించు విధంగా దానిపై భవిష్యత్ వడ్డీ + ఖర్చులు. C) 06-11-2024 D) లాంఛనప్రాయ స్వాధీనం | A) రూ. 59,03,000/- B) రూ. 5,91,000/- C) రూ. 25,000/- *ఒక నాచ్ (Notch) అధికం నుండి బిడ్డింగ్ ప్రారంభమగును | 14-05-2025న ఉ।। 11.00 గం. నుండి సా।। 4.00 గం. వరకు |

**ఇ–వేలం అమ్మకం యొక్క నియమ నిబంధనలు**

అమ్మకం సెక్యూరిటి ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని నిర్దేశిత నియమ నిబంధనలకు మరియు దిగువ ఇచ్చిన తదుపరి నిబంధనలకు లోబడి ఉంటుంది.
1. ఆస్తులు **"ఎక్కడ ఎలా వున్నవి అక్కడ అలా మరియు అక్కడ ఏమున్నదో అదే పద్ధతిన** విక్రయించబడతాయి.
2. పైన ఇందులో షెడ్యూల్‌లో నిర్దిష్టపరిచిన సెక్యూర్డ్ అసెట్ల వివరాలు అధీకృత అధికారి ఉత్తమ సమాచారం మేరకు తెలుపబడినవి. కానీ అధీకృత అధికారి ఈ ప్రకటనలో ఏదేని తప్పు, తప్పుడు నివేదిక లేదా వదిలివేయడానికి సంబంధించి జవాబుదారీకారు.
3. అమ్మకం **14-05-2025న** వెబ్‌సైట్ **http://www.mstcecommerce.com** వద్ద ఏర్పాటు చేసిన ఇ–వేలం ప్లాట్ ఫారం ద్వారా దిగువ సంతకందారుచే నిర్వహించబడును.
4. అమ్మకం సవివర నియమ నిబంధనలకు **www.pnbindia.in, www.mstcecommerce.com** లను చూడండి.
5. సెక్యూర్డ్ క్రెడిటార్లకు తెలిసిన తాకట్టు రుణభారాల వివరాలు: అధీకృత అధికారి సదరు ఆస్తికి సంబంధించి అటువంటి సమాచారం కలిగి వుండలేదు. అయితే, బిడ్డర్లు బిడ్డింగ్‌కు ముందు తమ స్వంత విచారణలు జరుపుకోగలరని సూచించడమైనది.

తేది: 25-04-2025, ప్రదేశం: హైదరాబాద్.

సం/– అధీకృత అధికారి, పంజాబ్ నేషనల్ బ్యాంక్, సెక్యూర్డ్ క్రెడిటార్.

సెక్యూరిటి ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 9(1)కు నిబంధన మరియు రూల్ 8(6) క్రింద 15/30 రోజుల అమ్మకం ప్రకటన